

బి.వి. రమణా రాజు

# సీతాపహరణం

సీత రైల్వేస్టేషన్‌కి ఆ రాత్రి వెళ్లాలనుకోటానికి తగినంత కారణం లేకపోలేదు. ఏడాదయింది భర్త రాజారావుకి ఐ. పి. యస్. సెలక్షనొచ్చి. ఆర్నెల్లయింది తనకీ రాజారావుకీ పెళ్లై. పోలీసాఫీసర్‌గా యీ వూరు బదిలీ అయ్యి అయిదు నెలలైంది. నాలుగు నెలల క్రితం వాళ్ళివూర్లో కాపరం పెట్టుకున్నారు. తనకిప్పుడు మూడో నెల. రెండు నెలల క్రితం స్పెషల్ ట్రెయినింగ్‌కి రాజారావు బెంగుళూరెళ్ళేడు. అతను తిరిగొస్తాడని నెల్లాళ్ళనుంచి వారాలూ రోజులూ లెక్కపెడుతోంది. ఎట్టకేలకు ఆ శుభదినం ఈనాడొచ్చింది.

ఉదయంనుంచీ నెలలు నిండిన గర్భిణీ స్త్రీలాగ గడియారం మహా భారంగా నడుస్తుంది. సాయంత్రం అది ఆగిపోయిందేమోనన్న అనుమానంతో రెండుసార్లు చెవిదగ్గర పెట్టుకుచూపింది. రెండుగంటల క్రితం నాలుగైంది. ఇప్పుడింకా నాలుగున్నరేమిటి చెప్మా అని పక్కింటి హనుమాయమ్మగార్ని మళ్ళీ టైమడిగింది. పరిస్థితిని గ్రహించిన ఆ యిల్లాలు, "చూడు సీతా! నా మాట విని చన్నీళ్ళ స్నానంచేసి, కాస్తంత అలా దేవాలయానికి వెళ్ళి అక్కణ్ణుంచి రైలుస్టేషను కెళ్ళమ్మా" అని సలహా యిచ్చింది.

స్టేషనుకెళ్ళి ప్లాట్‌ఫారంమీద కొచ్చేటప్పటికి రైలొచ్చి ఆగివుందేమో ఒకటే

కోలాహలం. ఆలస్యంగా వొచ్చినందుకు తననుతాను, సలహా యిచ్చినందుకు హనుమాయమ్మగార్ని తిట్టుకుని భర్తాన్వేషణ కుపక్రమించింది. తను ముందుగానే వొచ్చినట్లయితే ప్లాట్ ఫారం చివర నిలబడి అన్ని కంపార్టుమెంట్లూ చూడగలిగేది. ఇంకా బోలెడు టైంముందనుకుంది. ఛీ ఛీ దిక్కుమాలిన రైలూ దిక్కుమాలిన గడియారం అని విసుక్కుంటుంటే ఓ పోలీస్ కానిస్టేబుల్ అవిజ్ఞానవాలు పట్టి, ఓ శాల్యూట్ కొట్టి "అమ్మా! నమస్కారం. తమరేటిలా వొచ్చేరు. బంధువులెవరేనా వస్తున్నారా?" అని అడిగేడు.


రాజారావు తనని శ్రమపడి స్టేషన్‌కి రాత్రిపూట రావద్దనీ, దిగీదిగగానే వాయువేగ మనోవేగాలతో ఎగిరొచ్చి తన బాహువల్లరిలో వాల్తాననీ రాశాడు. కాని తను అతన్ని సర్ప్రయిజ్‌చేసి అనందంతో ఉక్కిరిబిక్కిరి చెయ్యాలన్న సత్సంకల్పంతో ఎవరిసహాయం అర్థించకుండా, పోలీసు సిబ్బందితో కూడా చెప్పకుండా బయల్దే రొచ్చింది. రామేశ్వరం పోయినా శనేశ్వరం తప్పలేదన్నట్టు ఈ పోలీసు జవానెదురయ్యాడు. సరే అదీ ఒకందుకు మంచిదే అని సంతోషించి, "అయ్యగా రొస్తున్నారు తెలీదా! నువ్వు ఆ వైపువెళ్ళి చూడు, నేను ఈ వైపు చూస్తాను." అంది.

"ఇది బెంగుళూరు వెళ్ళే బండండి. రావడం లేటయిందండి" అన్నాడు.

సీతకి చచ్చేటంత సిగ్గేసింది. చదువుకుంది, పోలీసాఫీసర్ భార్య, బోలెడు డిటెక్టివ్ నవలలూ, సాహస గాధలూ చదివింది. ప్లాట్ ఫారంమీద నిలబడ్డ రైలుకి యింజనెటువైపు నున్నదీ కూడా గమనించకుండా తనకీ కంగారేమిటి!

"నువ్వేమిటి ఇలా వచ్చావు?" అని అడిగింది కాస్త ధోరణి మారుద్దామని.

"యస్సైగారి సుట్టాలు బెంగుళూరెడతావుంటే రైలెక్కించడాని కొచ్చేనండి," అన్నాడు సవినయంగా.




"బెంగుళూరు నుండి వొచ్చే రైలు కూడా టైమవ్వస్తుందే." అంది, ఈ రైలిప్పట్లో కదిలే సూచనలేమీకనబడక.

"ఇదిప్పుడప్పుడే ఎళ్ళదటండి. అటు నుంచొచ్చే రైలు లేటండి. అదొచ్చేక కాని యిది బయల్దేరదండి."

"ఎంత లేటు?"

"ఇందాక యస్సైగారు ఫోన్ చేస్తే గంటో గంటన్నరో పడద్దన్నారండి. అరింటికెళ్ళి భోజనం చేసుకొస్తానన్నారండి."

భోజనంచేసి రాకపోతే ఓ కునుకు తీసొస్తాడు. వాడికికంగారేముంది! అసలు తను కూడా రైల్వే యింక్వయిరీస్‌కి ఫోన్‌చేసి ఆ రైలెప్పుడు వెంచేస్తుందో కనుక్కుని రావల్సింది.తనకున్న ఆత్రత రైలు కెందుకుంటుంది అన్న ఆలోచన కలగలేదు అవసరమైనప్పుడు తప్ప రైళ్ళెప్పుడూ టయిముకే వస్తాయి.

"రైలు గుంటకల్లేనా వచ్చిందా లేదా?" అని అడిగింది, ఉపవాసం జాగరణలతోటి భర్తను గురించి తపస్సు చేస్తూ ఉండగా ఈ రాత్రి శివరాత్రి అవుతుందేమోనని.

"రైలు బయల్దేరితే పావుగంటలో వచ్చేస్తాదండి. దోణాచలం దాటాక పది మైళ్ళొచ్చేతలికి రైలు పట్టాలుతప్పిందంటండి."

చావుకబురు చల్లగా చెప్పేడన్న సామెత జ్ఞాపకమొచ్చి యింక్వయిరీ ఆఫీసుకేసి పరుగెత్తింది. ఎంక్వయిరీ అసిస్టెంటు రిసీవర్ ఫోన్‌మీద పెట్టేస్తూ సీతకేసి చూసి "యస్ ప్లీజ్?" అన్నాడు.

"ఎక్కడ డిరెయిలయ్యిందండీ?" అని అడిగింది.

"ఇక్కడికి పదిమైళ్ళ దూరంలో...." అంటూ ఇంతలో గొణుగుతున్న టెలీఫోన్ రిసీవరెత్తి "ఎంక్వయిరీస్.... ఓరినువ్వట్రా! అప్పుడే ఎక్కడ! ఎయిటీ ఫైవ్ అప్ కాఫీ ఫలహారాలు సేవిస్తుంది. ఎయిటీ సిక్స్ డౌన్‌కి స్వాగతం చెప్పేక దీనికి వీడ్కోలు.... ఫైవ్ టెన్నా, టెన్ ట్వంటీయా.... సిండికేటా! బోర్ ....ఎస్ యమ్‌గాడిలా వొస్తే ఎనౌన్సర్ కిష్టిగా ఇక్కడ కూర్చోపెట్టి కొట్టుకొచ్చేస్తాను రైట్ ....ఏంకావాలమ్మా?"

" డిరెయిల్ అంటున్నారు....ఏమ

యినా ప్రమాదం జరిగిందాండీ!" అంది విక్కుమంటూ.

"డిరెయిలయింది గూడ్సింజనండీ. ఈ పాటికి లైన్ క్లియరయి పోయుంటుంది."

"ట్రెయినో అరగంటలో వచ్చేస్తుందంటారా?"

"అరగంటా....మహా అయితే ఓ గంట. వెయిటింగ్‌రూంలో కూర్చోండి" అని సలహా యిచ్చేడు.

వొచ్చే పురుడూ, రైలూ రాకుండా పోవు. వస్తే అరగంటా లేకపోతే గంటా అంటే అయితే మగపిల్లాడు లేకపోతే ఆడపిల్లా అన్న జోస్యం అంత అవకతవకగా అనిపించింది. పరిస్థితి అలాంటిది. గత్యంతరంలేక బుక్‌స్టాల్ కెళ్ళి స్టేన్లీ గార్డ్‌నర్ నవలొకటి కొనుక్కుని వెయిటింగ్‌రూంలో కూర్చొని నాలుగైదు పేజీలు యాంత్రికంగా చదివింది. రైలు సస్పెన్స్‌తోబాటు నవల సస్పెన్స్ కూడా పొడిగించుకోట మెందుకని ఆఖరి నలభై ఏభైమిది పేజీలూ, అంటే కోర్టు సీనుతో మొదలెట్టి చదివి పారేసింది. గడియారం చూసింది. గంటయినా రైలు జాడలేదు. ఎంక్వయిరీ అసిస్టెంటు మొహం తగలేద్దామని అటు వెళ్ళింది. వాడు ఫైవ్ టెన్నుకో, టెన్ ట్వంటీకో పోయుంటాడు. వాడి స్థానే మరో ఘటం అవతరించేడు.

ఒక్కక్షణం రిసీవర్ నోరుమూసి సీతకేసి తిరిగి "ఎస్?" అన్నాడు. ఇంతలోనే "బెంగుళూరు నుండి వచ్చే ఎక్స్‌ప్రెస్ మరో గంటలో రెండో నెంబరు ప్లాట్‌ఫారం మీదకు వొచ్చును. బెంగుళూర్ సే ఆనేవాలీ ఎక్స్‌ప్రెస్...." అన్న ప్రకటన విని ఆ యేస్‌గాడి ఫేస్ చూసి ముఖం చిట్లించుకుని రైల్వే సంస్థని అష్టోత్తరనామావళితో స్తుతిస్తూ చల్లగాలి కోసం స్టేషన్ బయటకొచ్చింది.

రిక్షా, ఆటో, టాక్సీవాళ్లూ పోర్టర్లూ గుంపులుగుంపులుగా కూర్చొని తీరుబడిగా బీడీలు సిగరెట్లు కాల్చుకుంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. భుజాన్ని వేళ్లాడే వేనిటీ బేగ్ ఎడంచేత్తో పట్టుకుని తెరిచి, కుడిచేతిలో వున్న స్టేన్లీ గార్డ్‌నర్ నవల అందులో పెడుతుండగా, ఇందాక కనబడ్డ కాన్‌స్టేబుల్ మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు. 'తమరు ఎంతసేపని కూర్చుంటారమ్మా! పదండి యింటికాడ దిగపెడతాను. టాక్సీ తీసుగొస్తాను," అంటూ రెండడుగులు వేసేలోగా వొద్దు వొద్దని ఆమె అనడం, వాయువేగంతో ఓ ఎంబాసిడర్ కారొచ్చి కళ్ళు చీకట్లు కమ్మేలాగ హెడ్‌లైట్ల కాంతి ఆమె మొహంమీద పడటం క్షణంలో జరిగిపోయింది. కారాగింది. హెడ్‌లైట్లు ఆన్‌చేసే వున్నాయి. డ్రైవర్ కారు దిగొచ్చి తమకోసమే కారొచ్చింది," అన్నాడు.

"నాకోసమా!" అంటూ ఇంకిక్కడ తర్కించడం బాగుండదనీ, పైగా డ్రైవర్ మారుమాటాడకుండా తిరిగెళ్ళి మళ్లా డ్రైవింగ్ సీట్లో కూర్చోవడంవల్లా కళ్ళల్లో సూదుల్లా గుచ్చుకుంటున్న హెడ్‌లైట్లు వెలుగులో, పోలీసాఫీసర్ భార్య సీత ఠీవిగా కారువైపు నడిచింది. ఎడికె 5445 ఎవరి కారు చెప్మా అనుకుని "ఎవరు పంపేరు కారు?" అంటూ కలర్ గ్లాసెస్ పైకెత్తివున్న వెనకసీటు వైపుకు అడుగులేస్తూ వుండగా డ్రైవర్ వెనక్కివొంగి లోపల్నుంచి వెనకసీటు డోర్ హేండిల్ రిలీజ్ చెయ్యడంతో డోర్ తెరుచుకుంది. బలమైన రెండు చేతులు, తలవొంచి లోపలికి ఎక్కుతున్న సీత రెండు భుజాలూ పట్టుకుని లోపలికి లాగ్గానే డ్రైవర్ కారు స్టార్ట్ చేసి వెనకడోర్ కుడి చేత్తో వేసెయ్యడం ఒక్కసారి జరిగేయి. ఈ హఠాత్పరిణామానికి దిగ్భ్రాంతిచెందిన సీత ఆ వెనక సీట్లో కూర్చున్న వ్యక్తి మోకాళ్ళమీద అడ్డంగా బోర్లాపడింది. అతను ఆమె రెండుచేతులూ వెనక్కిలాగి ఆమె భుజాన్ని వేళ్ళాడుతున్న వేనిటీబేగ్ బెల్టుతో రెండుచేతులూ కట్టి ముడివేస్తూ, భయంకరమైన బొంగురుగొంతులో "నే సెప్పినట్టు సేసేవా నీకే ఆపదా వుండదు. నాక్కావల్సింది నువ్వుకాదు. నీ పెనిమిటి రాజారావు. రెండు మాసాల కిందట ఖూనీకేసులో యిరుక్కున్న గంగరాజు మావోడు. నీక్కావల్సిన డబ్బిచ్చుకో ఆడికి జామీనిప్పించవయ్యా అంటే ఈల్లేదు పొమ్మన్నాడు. ఇప్పుడు రెండు మాసాల ట్రెయినంగయి వస్తున్నాడు గందా, నిన్నడ్డంపెట్టుగుంటే .... నా రాజా!....ఎన్ని జామీన్లయినా సంతగా లెడతాడు," అంటూ జేబురుమ్మాలుతీసి దానితో సీత కళ్ళకి గంతలుకట్టి సీతను సీట్లో కూలేసి నడుంచుట్టూ చేతులువేసి గట్టిగా అదుముకు పట్టుగున్నాడు. కారు నడుస్తూండగా కాలుతో డోర్‌హేండిల్ రిలీజ్ చెయ్యబోయింది. కాని కారు డోర్ హేండిల్‌వరకూ వెళ్ళకుండానే నడుం మీదనుంచి చేతిని ఆమె తొడవైపుకు దించి అదిమిపట్టేడు. ఓ వైపు భయం ఆందోళన కృంగదీస్తున్నాయి. తన దేహబలాన్నీ బుద్ధిబలాన్నీ ధైర్యాన్నీ ఎన్నోసార్లు ప్రదర్శించి భర్త మెప్పు పొందిన అహం ఓవైపున పొంగి పొర్లుతుంది. మరోనిమిషంలో కారు ఎడమవైపుకు మళ్ళింది. కారు ఎక్కడికెడుతున్నదీ మనస్సులోనే గుర్తుపెట్టుకునే ప్రయత్నం ప్రారంభించాలన్న వుద్దేశంతో సీటులో వొరుగుతూ సొమ్మసిల్లినట్టు మూలకి జారగిలబడింది. సుమారు నూరు అంకెలు ఒక స్థాయిలో లెక్కపెట్టడానికో నిమిషం పడుతుందని అంచనా వేసుకుని అంకెలు లెక్కపెట్టడం మొదలెట్టింది. ఆ లెక్కని మళ్ళీ నాలుగున్నర నిమిషాలకి కుడివైపుకు మళ్ళింది. మళ్ళీ నిమిషంలోపలే



కుడివైపుకి మళ్ళింది. తర్వాత స్ట్రెయిట్ రోడ్‌లాగుంది ఏడునిమిషాలు పట్టింది. కారు స్లోడౌనయింది. ఎడమవైపు తిరిగి ఆగింది. 'ఉస్' 'ఉస్' అంటూ విశ్శబ్దంగా వుండమని సౌంజ్ఞలు జరుగుతూండగా కారు డోర్ తెరుచుకుంది. ఆ దుర్మార్గుడు కారు దిగి సభ్యతా సంకోచం లేకుండా ఆమెను తన శరీరానికి అదిమిపట్టుకుని సీట్లోంచిలాగి భుజంమీద వేసుకున్నాడు. వన్, టూ, త్రీ, ఫోర్-నాలుగు మెట్లెక్కేడు. పన్నెండడుగులు వేసి కుడివైపునున్న గది గడియతీసి తలుపులు కాళ్ళతో తన్ని లోపలికి నాలుగడుగులేసి ఆమెని భుజంమీంచి చేతులమీదకి యెత్తుకుని ఫోమ్‌బెడ్‌మీద పడేసేడు. "ఇదిగో బుల్లెమ్మా? ఇది సౌండ్‌ప్రూఫ్‌గది. అంచే నువ్వెప్పు డర్పినచ్చినా బయిటోళ్ళ కినపడి సావదు. బుద్ధిమంతితనంగా వుంచే ఈడ నీకేకొరతా వుండదు. ఓ అరగంట రెస్టుచ్చుకో. మళ్ళీ వత్తా" అంటూ ఆ రాక్షసుడు హెచ్చరించి తలుపేసుకుపోయేడు.

అయిపోయింది. తను కనే కలలన్నీ కరిగిపోయాయి. తన జీవితం కొద్ది క్షణాల్లో సర్వనాశనం కాబోతుంది. భయం ఆందోళన నిస్సహాయత ఆమె మనస్సును మేఘాల్లాగ ఆక్రమించుకున్నాయి. తను ఏం చెయ్యాలి? ఏం చెయ్యగలదు! అరగంటలో వస్తాడు. ఈ అరగంలో తనెలాగ ఈ పాపకూపం లోంచి బయటపడాలి! తనకింక భగవంతుడే దిక్కు అనుకుంటూ నిస్సహాయంగా పరుపుమీద అటూయిటూ దొర్లింది. చటుక్కున తనకాలికి తగిలి కదిలి చప్పుడుచేసింది, తనకి చిరపరిచితమైన వస్తువు-టెలిఫోన్-సందేహంలేదు. దాన్ని ఉపయోగించుకోటం ఎలాగ? తన చేతులు తన వెనక్కాల తన హేండ్ బేగ్ బెల్ట్‌తో కట్టేసి వున్నాయి. కొద్దిగా వొదులుచేసుకోటానికి ప్రయత్నించింది. బెల్టు కొద్దిగా సాగిందికాని తెగిపోడానికి కాని ముడి విప్పడానికికాని సాధ్యం కాలేదు.ఎలాగైనా ఆ టెలిఫోన్ ఉపయోగించుకోవాలి. అది తప్ప శరణ్యంలేదు. నెమ్మదిగా అటువైపు దొర్లింది.టెలిఫోన్ హుక్‌మీదనుండి రిసీవర్‌ను వేళ్ళలో పట్టుకొని పరుపుమీదకి లాగింది. నెమ్మదిగా రిసీవర్‌ని తలగడమీదకి లాగింది. వేళ్ళతో ఒక్కొక్క అంకే లెఖ్కపెట్టి పోలీస్‌స్టేషన్‌కి రింగ్ చెయ్యాలని మూడుసార్లు ప్రయత్నించింది. సాధ్యంకాలేదు. ఇంతలో మరో ఆలోచనొచ్చింది. రెండుచేతులూ చెయ్యగలిగినంత వెడల్పుచేసి అందులోంచి తన పృష్ఠభాగాన్ని, తర్వాత తన తొడలనీ, ఆపైన తన కాళ్ళని, నడ్డివొంచి, దూర్చింది. అంతే చేతులు ముందుకువచ్చేయి. ఒక్కసారి భగవంతుణ్ణి మనసారా స్మరించి వెంటనే కార్యరంగంలోకి దిగింది. నెంబర్లను వేళ్ళతో తడిమి లెఖ్కపెట్టి మళ్ళీ పోలీస్‌స్టేషన్ నెంబర్‌ని డయల్‌చేసింది. ఈసారి స్పష్టంగా రింగయింది. "హలో! టూటౌన్ పోలీస్టేషన్" అన్న స్వరం వినపడింది.

"అక్కడ యస్సై మూర్తిగారున్నారా?"

"ఉన్నారమ్మా! తమ రెవరు?"

"పోలీస్ సూపరెన్టెంట్ రాజారావుగారి భార్యని," అంది సీత, నెమ్మదిగా. తరవాత ఆ గది సౌండ్‌ప్రూఫ్ అన్న మాట జ్ఞాపకమొచ్చింది.

"యస్ మేడం?" అన్న మూర్తి గొంతు వినబడింది.

"మిస్టర్ మూర్తీ....నేను చెప్పింది జాగ్రత్తగా వినండి. నేను చాలా ప్రమాదంలో వున్నాను. నన్ను రక్షించాలంచే కొన్నిక్షణాల టైంమాత్రమే వుంది. మావారిని రిసీవ్ చేసుకోటానికి రైలుస్టేషన్‌కి వెళ్ళేను."

"అర్ధరాత్రివేళ మీ రెక్కడమెందుకమ్మా! మేమందరం...."

"ఎదురు ప్రశ్నలు వెయ్యొద్దు. ప్లీజ్




నోట్...అక్కడికి ఎ.డి.కె. 5445 బ్లూ ఎంబాసిడర్ వొచ్చింది. అందులోకి నన్ను బలవంతంగా లాగి, కళ్ళకి చేతులకీ కట్లుకట్టి...."

"ఎ. డి. కె. 5445 ఎంబాసిడరా అన్నారు?"

"అవును. మాట్టాడొద్దు. నోట్ చేసుకోండి. కారు స్టేషన్నుంచి బయల్దేరి ఓ నిమిషంతర్వాత ఎడమవైపుకు తిరిగింది. నాలుగున్నర నిమిషాలతర్వాత కుడివైపుకి, అక్కణ్ణుంచి ఓ నిమిషం లోపలే మళ్ళీ కుడివైపుకీ, అక్కనుంచి ఏడునిమిషాలు స్ట్రెయిట్ రోడ్‌లో వెళ్ళి ఎడమవైపు గేట్లోంచి వెళ్ళింది. ఆ యింటికి ముందు నాలుగు మెట్లున్నాయి. అవిదాటి పన్నెండడుగులువేస్తే కుడివైపునున్న గదిలో యిప్పుడు నేను బందీగా వున్నాను-ఎవరో గంగరాజుకు జామీను ఇవ్వలేదుట...."

"అమ్మబాబోయ్! వాడి చేతుల్లో పడ్డారా?"

"వాడెవడో తెలుసా?"

"ఈ స్టేటు మొత్తానికి గజదొంగ. ఐ.జి.పి. గారుకూడా ఏం చెయ్యలేరు. మీరింత అర్ధరాత్రివేళ...."

"నీ భార్యనెవరేనా ఎత్తుకుపోయినా యింతేనా!"

"అర్ధరాత్రివేళ మా ఆవిడ వొంటరిగా...."

"యూ బ్లడీఫూల్. నువ్వేమీ చెయ్యలేవు....చెయ్యవు. మావారితో చెప్పు. ఆయన ఎంతటి గజదొంగనయినా ప్రాణానికి తెగించయినా పట్టుకుని నన్ను రక్షిస్తారు."

"సూపర్నెంటుగారికి ఆ గజదొంగే ఫోన్‌చేస్తాడండి. ఇప్పుడో, ఇంకో నిమిషానికో. మధ్యన నేను చెప్పడమెందుకండి. నేను కలగజేసుకుంటే నన్ను పొడిచేస్తాడు."

"అయితే నువ్వేమీ చెయ్యనంటావు! దౌర్భాగ్యుడా! యిందుకా మీకు గవర్నమెంటు జీతాలిస్తుంది! ఇలా యిక్కడ నేను కుళ్ళి చావాల్సిందేనన్నమాట!

"ఇప్పుడు మీరేం తిట్టుకున్నా నేనేం చెయ్యలేను. ఇప్పుడంతా మా పోలీసోళ్ళకి పుణ్యానికెడితే పాపం ఎదురొచ్చే రోజులు...."

"షటప్....నీ దిక్కుమాలిన లెక్చరాపి, బెంగుళూర్ ఎక్స్‌ప్రెస్‌లో మావారొస్తున్నారు. ఆయనకి చెప్పు. చచ్చే ముందర ఆయనొన్నిసారి కళ్ళతోనైనా చూస్తాను."

"ఇప్పుడు మీరు ఏ నెంబర్‌నుంచి ఫోన్‌చేస్తున్నారండి?"

"యూ! ఇడియట్! నా కళ్ళకి గంతలు కట్టేడు...." అని తన చేతులు యిప్పుడు వెనకలేవు ముందే వున్నాయని గుర్తుకొచ్చి "వెయిటే సెకండ్" అంటూ వేళ్ళతో కళ్ళకి కట్టిన చేతిరుమ్మాల్ని తొలగిస్తుండగా ఒక బలమైన చెయ్యి తన వెనుకనుండి ముందువైపుకు వచ్చి వెనకకు అదిమిపట్టింది.

"పోలీసోళ్ళకి బయపడేవోణ్ణయితే ఈపజ్జెయ్యగల్గునా! ఆళ్ళు మనం కూకోమంటే కూకుంటారు లెగమంటే లెగుస్తారు." అంటూ ఆమె మొహాన్ని బలవంతంగా వెనక్కివొంచి పెదవుల మీద ముద్దెట్టుకున్నాడు. 'ధూ' అని ఉమ్మేసి మోచేత్తో గట్టిగా వాడి పొట్టలో పొడిచింది. అబ్బా! అంటూ వాడు వెనక్కి జరగడం, టెలీఫోన్ డిస్కుకేసి చూస్తూ రిసీవర్‌లోకి '2567' అనడం ఒక్క క్షణంలో జరిగేయి.

"నేనడిగింది మీ యింటి టెలిఫోన్ నెంబర్ కాదు...." అన్న మూర్తి గొంతు సీతకి దిగ్భ్రమ కలిగించింది. నలుమూలలా చూసింది. అది తన గదే. వెనక్కితిరిగింది. "నేనేడ యిబ్బంది పడతానోనని ఆ రైలుపట్టాలు తప్పిన కాడికి కారు తీసుగొచ్చి యింటికాడ దిగబెట్టిన ఆ యినస్పెక్టర్ మూర్తికిప్పుడు నే నెళ్ళి నీమూలంగా శమాపణ సొప్పుగావాలి," అంటూ ఆ బొంగురు గొంతు ననుకరిస్తూ పోలీస్ సూపర్నెంట్ రాజారావు పొట్ట చేత్తో రుద్దుకుంటూ కనబడ్డాడు.